# భయస్తుడు

నేను ఆ ఊళ్ళో వైద్యవృత్తి క్రొత్తగా అవలంబించిన రోజులవి. నా నర్సింగ్ హోమ్‌లో అధునికమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించడం కారణంగా రోగులు ఎక్కువమందే రావడం మొదలు పెట్టారు. అందువల్లనే ఆ రోజున ఆ 'అర్జంటు' 'కొత్త' కేసు వచ్చినప్పుడు నేను ఆశ్చర్యపడలేదు.

ఇద్దరు ముసిలాళ్ళ తోడురాగా ఓ పడుచావిడ పడుతూ లేస్తూ లోపలకు వచ్చింది.

నాకు నవ్వు వచ్చింది.

ఆమెకు ఒకవైపు తల్లీ, మరోవైపు అత్తా చెరో రెక్క పుచ్చుకొని వంగబడి నడుస్తూ వచ్చారు. బలంగా కొంచెంలావుగా ఉన్న ఆ పడుచావిడ అలా నెమ్మదిగా మధ్యమధ్య పెద్దగా అమ్మో-అత్తో అంటూ మూలుగుతూ అడుగు ముందుకు వెయ్యలేక పోతున్నట్లు తూలుతూ రావడం చూచేసరికి నాకు నవ్వు ఆగలేదు. ఆమె వస్తూనే నేను నవ్వడం గమనించింది. కాని అలా గమనించినట్లు బయటపడలేదు.

ఆమె కళ్ళింత చేసుకొని నావంక జాలిగా, ఆదోలా చిత్రంగా చూచింది.

ఆ చూపుల్లో అప్యాయత ఉన్నది. అంచక్కా చెంపకు చేరదేసి ఉన్న ఆ కళ్లలో ఎంతో ఆకర్షణ ఉన్నది. ఆమె చూపులో ఏదో

వైచిత్రి ఉన్నది. ఆమె కేదో గొప్ప భవిష్యత్తు ఉన్నదని అనిపిస్తున్నాయి ఆ చూపులు. నేను ఆమెవంక పరీక్షగా చూచాను.

ఆమె నిజంగా అందకత్తె.

వయస్సు ఇరవైరెండు, ఇరవైమూడు సంవత్సరాలకంటె ఎక్కువ ఉండదు. ముఖంలో అదో రకమైన అమాయకత్వం కన్పించింది. నాగరికత నేర్చిన మనిషిలా లేదు. వేషధారణలో ఎక్కడా నవనాగరకుల అనుకరణ లేనేలేదు. కాని అంతమాత్రంచేత కేవలం పల్లెటూరి బైతులా ఉన్నదని ఎవ్వరూ అనుకోలేరు. చక్కగా తల దువ్వుకొని జుట్టుముడి వేసుకొన్నది. ఆ కట్టూ బొట్టూ చక్కగానే ఉన్నాయి. అవి సర్వ సాధారణంగానే కన్పించినా ఏదో విలక్షణమైన ఆకర్షణ ఉన్నది. శిరోజాలంకరణలో, వస్త్రధారణలో, నడకలో, కూర్చున్న తీరులో ఆమెకు కళాత్మకమైన దృష్టి ఉన్నట్లు అన్పించింది. మరికొన్ని క్షణాలు ఆమెవంక చూడకుండా ఉండలేక పోయాను.

ఆమె వచ్చటి పసిమి శరీరం నిగనిగ లాడుతున్నది. చేతులు గుండ్రంగా అందంగా ఉన్నాయి. మంచి జబ్బపుష్టికల మనిషి. నేను చూస్తున్నానని అనుమానం కలిగి కాబోలు ఆమె పమిట లాక్కొని నిండుగా కప్పుకొన్నది.

'ఇదేమిటి ఎన్నడూలేనిది వైద్యానికి వచ్చిన మనిషి అందచందాలు పరీక్షించడంలో పడ్డాను. తప్పుకదూ !' అనుకొని నేను వెంటనే దృష్టి మరల్చుకొన్నాను.

"అమ్మా- అత్తా- నొప్పి-నొప్పే"

"ఆ ఇప్పుడు చెప్పండి- ఎన్నాళ్లనుంచి వస్తున్నది నొప్పి ?" అని నేను నెమ్మదిగా అడిగాను.

"అబ్బో ఈనాళ్లనుంచి" అన్నది ఆమె తల్లి.

"అబ్బే ఎక్కడా పది రోజులనుంచేగా!" అన్నది ఆమె అత్త.

"నీకేం తెలుసు. దాన్ని చెప్పనీయ్. పదిరోజులనుంచే అయితే మనఊళ్లో రెండు నెలలనుంచి అది మందు ఎందుకు పుచ్చుకొంటున్నదీ?" అన్నది ఆమె తల్లి.

ఆ మాటమీద ఆ ముసలివాళ్లు ఇద్దరూ తగూ ప్రారంభించారు. నువ్వు ఊరుకోమంటే నువ్వు ఊరుకోమనుకున్నారు.

"అమ్మో నొప్పి" ఆమె పెద్దగా బాధగా మూలిగింది.

నేను నర్సును పిలిచి ఆ ముసలివాళ్లను ఇద్దరినీ బయటకు తీసుకొని వెళ్లమన్నాను. వాళ్లు అలా వెళుతుండగా నేనులేచి అవతలి గదిలో అడుగు పెడుతూ "రండి. వచ్చి ఆ బల్లమీద పడుకోండి. పరీక్ష చెయ్యాలి" అన్నాను. అందుకు ఆమె పెద్దగా "ఆ ఎందుకు. ఇక్కడే పరీక్ష చెయ్యండి" అన్నది. "ఇక్కడ వీలుపడదు. మీకేం భయంలేదు." అన్నాను నేను నెమ్మదిగా ఆమెకు నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తూ. "నాకు భయమని కాదు. మా వాళ్లకు అనుమానం" అన్నది ఆమె.

"అవన్నీ నేను చూచుకుంటాను. ముందు పదండి" అని అప్పుడే తిరిగి వచ్చిన నర్సుతో ఆమెను త్వరగా లోపలకు తీసుకొని రమ్మనమని చెప్పాను.

ఆమె వెళ్లి పొట్ట నొక్కుకుంటూ సన్నగా మూలుగుతూ బల్లమీద కూర్చున్నది. నర్సువచ్చి బలవంతపెడితే ఆ బల్లమీద పడుకున్నది. మరో క్షణం తర్వాత ఆమె పెద్దగా "అత్తా: నువ్వు యిలారా. నాకుసిగ్గు. ఈ మొగడాక్టరు చేత పరీక్ష చేయించుకోవడం ఏమి ఖర్మం నాకు" అన్నది.

నేను స్టెతస్కోపు తీసుకొని ఆమె దగ్గరకు వెళ్లి "అలా అనకూడదు. అవసరమైతే లేడీ డాక్టర్ను నేనే పిలిపిస్తాను" అన్నాను.

ఆమె నర్సుతో మాట్లాడుతున్నప్పుడు నేను ఆమెవంక - ఆమె ముఖం వంక పరీక్షగా చూచాను. నేను అలా చూస్తున్నట్లు ఆమె గమనించకుండా జాగ్రత్త పడ్డాను.

అప్పుడు నాకో అనుమానం కలిగింది. ఆ అనుమాన నివృత్తికోసం ఆమె పద్ధతే నేనూ అనుసరించాను. చాలా గాభరా పడుతున్నట్లు కన్పించి, నర్సును పిలిచి పెద్ద సిరంజిలు, సూదులు రెండు జతలు తెమ్మన్నాను. అవన్నీ తెచ్చి అక్కడొక చిన్న బల్లమీద పెట్టింది నర్సు. నేను బీరువాలోనుంచి మందులు తీసి ఆమె దగ్గరకు వెళుతూ కొంచెంపెద్దగా నర్సుతో "నువ్వు ముందుగదిలో ఉండు. లేడీడాక్టరుగారికీ, డాక్టరు కృష్ణయ్య గారికీ కబురు పెట్టు. ఈమె తాలూకు మనుష్యులను ఎవరినీ లోపలకు రానియ్యవద్దు." అన్నాను.

నర్సు అటు వెళ్ళగానే నేను సిరంజిలోకి మందు తీసుకొని ఆమె దగ్గరకు వెళ్ళి నెమ్మదిగా రహస్యం చెబుతున్నట్లు నటించి, "ఈ ఇంజక్షన్లు చాలా నొప్పి చేస్తాయి. జబ్బు లేకపోతే వికటించే ప్రమాదం కూడా ఉన్నది. నిజం చెప్పండి. ఇదంతా బాధేనా?" అని అడిగాను.

"నన్ను మీ ఆస్పత్రిలో చేర్చుకొని మీకు తోచిన పరీక్షలు చెయ్యండి. వాటికి ఎంత వ్యయమైనా నేను భరిస్తాను" అన్నది ఆమె నెమ్మదిగా.

"ముందు నేను అడిగిన దానికి సమాధానం చెప్పండి." అన్నాను కొంచెం పెద్దగా గదమాయిస్తున్నట్లు.

ఆమె మరో వైపు తిరిగి 'అమ్మో- అమ్మో' అంటూ పెద్దగా మూలిగింది.

అప్పుడు నేను కోపంగా "ఆహా" అయితే సమాధానం చెప్పరన్నమాట. ఊరికే నర్సింగ్‌హోమ్‌లో చేరడానికైతే ఈ ఊళ్లో చాలానే ఉన్నాయిగా? అక్కడి కెక్కడికైనా వెళ్ళక పోయారా?" అన్నాను. ఆమె నావంక దీనంగా చూచింది. కొన్ని క్షణాల తర్వాత ఆమె నెమ్మదిగా "మీరు అన్నట్లుగా అటువంటి నర్సింగు హోములూ ఉన్నాయి. అల్లాంటి డాక్టర్లూ ఉన్నారు కానీ వారికి ఆపేరూ వచ్చింది. అందువల్లనే మా వాళ్లు అక్కడకు ఎక్కడికీ వెళ్ళనివ్వలేదు. ఎవరివిషయం ఎలా ఉన్నా మా ఆయన అసలు ఊరుకోరు. నిలువునా ప్రాణంతీస్తారు." అన్నది. "అల్లాగా. మీ వాళ్లు అనుమానించరని ఇక్కడకు వచ్చారన్నమాట! వచ్చి నా ప్రతిష్ఠ పాడుచెయ్యా లనుకొన్నారు నాకు ఇటువంటివి గిట్టవు. అలా వచ్చే ప్రాక్టీసు నాకు అక్కర్లేదు. మీరు...." అని ఆగాను.

అందుకు ఆమె వెంటనే "అదీ మాకు తెలుసు. అటువంటివాళ్లను గుమ్మంలోకే రానియ్యరనికూడా మా ఊళ్లో అందరూ చెప్పుకొంటున్నారు. అందువల్లనే మీదగ్గరకు వచ్చాను. డాక్టరుగారూ నన్ను దయతల్చండి" అన్నది.

ఆమె వంక ఒకసారి పరీక్షగా చూచాను. ఆమె కళ్ళవెంట నీరు కారుతున్నది. జాగర్లమూడి తమలపాకుల్లా ఉన్న ఆమె చెక్కిళ్లపై కన్నీటిధారలు చారికలు కట్టాయి. కొన్ని నిముషాల తర్వాత ఆమె వెక్కి వెక్కి ఏడ్వడం మొదలు పెట్టింది.

నాకు జాలి కలిగింది. మరో క్షణం తర్వాత భయం వేసింది. ఆ పరిస్థితిలో ఇక్కడకు ఆమె తాలూకు వాళ్లు ఎవరైనా వస్తే

ఆమె తనకు ఇక్కడ ఆశ్రియం లభించలేదన్న నిస్పృహతో, కోపంతో నా మీద ఏదో అపనింద వెయ్యవచ్చు. ఇంత గొప్పగా నటన చెయ్యగల మనిషి ఏమైనా చెయ్యవచ్చు. తొందర పడడం మంచిది కాదు అనుకొన్నాను.

అలా అనుకొంటూ నేను ఆమెకు మరింత దగ్గరగా వెళ్లి నిలబడి "మీరు ఏడ్పు మానేయండి. ఎవరైనా వస్తే మీకూ నాకూ కూడా అప్రతిష్ఠ. నటన అద్భుతంగా ఉన్నది. రోజూ రకరకాల రోగులను చూస్తూఉండే నేనే పోల్చుకోలేకపోయాను. మోసం చెయ్యడానికి ప్రయత్నించినందుకు మీరంటే కోపంగానే ఉన్నది. కాని ఎందుకో మీమీద జాలి కలిగింది. ఇప్పుడు త్వరగా, క్లుప్తంగా చెప్పండి. ఎందుకింత అసహ్యమైనపని చేశారూ? మన ఉభయులకూ ఏవిధమైన అప్రతిష్ఠ రాని పక్షంలో మీ కెలాంటి సహాయం కావాలన్నా చేస్తాను—" అని ఆగాను.

ఆమె కళ్లు గట్టిగా తుడుచుకొన్నది. ఆమె చెక్కిళ్లు ఎర్రబడ్డాయి. పై పళ్ళతో క్రింది పెదిమలు గట్టిగా నొక్కుకుంటూ దుఃఖం దిగమ్రింగడానికి ప్రయత్నించింది. ఆమె అధరాలు గులాబీ రేకుల్లా ఉన్నాయి. అవి గాలికి కదిలే రావి ఆకుల్లా కంపిస్తున్నాయి.

ఆమె నెమ్మదిగా తల ఎత్తి నా కళ్లల్లోకి చూస్తూ "చెప్పుకొనే మాటలు కావివి. కాని మీరు దైవసమానులని అనిపిస్తున్నది. కనుక, నిజం చెప్తాను. నా భర్త తాగుబోతు, తిరుగుబోతు, దానికితోడు చీట్లపేక. డబ్బు అన్నివిధాలా తగలేస్తున్నాడు. ఆయన్ను వాళ్లు ఎవ్వరూ ఏమీ అనరు- అనలేరు కూడాను. ఆయన్ను దారిలో పెట్టడానికి కొన్ని సంవత్సరాలనుంచీ ఎన్నోవిధాల ప్రయత్నిస్తూనే ఉన్నాను. కాని ఫలితం దక్కడంలేదు. నేను తిట్లూ, దెబ్బలూ తినని రోజు లేదు. జీవితంలో నాకు ఏవిధమైన సుఖమూ లేకుండా పోయింది.

ఇంట్లో అత్తపోరు క్రమంగా ఎక్కువయిపోయింది. ఆవిడ కొడుకును అదుపులో పెట్టుకోలేక నా మీదపడి ఏడుస్తుంది. కసి అంతా నా మీద చూపిస్తుంది. నన్ను వాకిట్లోకి వెళ్లనివ్వదు. ఓ అణాపెట్టి పూలు కొనుక్కోనివ్వదు చుట్టుపట్ల ఆడవాళ్ళతో కలిసి సినిమాలకు వెళ్లనివ్వదు. ఎందుకు లెండి ఆ వివరాలన్నీ... నాకా ఇల్లు నరకం అయిపోయింది. ఇలాంటి బాధలు ఎవరైనా కొంతకాలమే భరించగలరు. నేను మొదట పారిపోదామనుకొన్నాను. అది కుదిరే విషయం కాదని తేలాక ఏ బావిలోనో, కాలవలోనో దూకుదా మనుకున్నాను. కాని అలా చెయ్యలేక పోయాను. మా అమ్మ నన్ను కంటికి రెప్పలా కాపాడుకొంటోంది. దానికి నేను తప్ప మరెవ్వరూ లేరు...ఇక్కడ కొంతకాలం ఉండి మానసికంగానూ, శారీరకంగానూ కొంచెం బాగుపడ్డాక ఇటునుంచి ఎటైనా పోదామని అనుకొన్నాను..."అని ఇంకా ఏమో చెప్పబోతూ, బయట ఏదో చప్పుడైతే భయపడి, చప్పున వెనక్కువాలి వడుకొంటూ 'డాక్టరుగారూ నన్ను మాత్రం ఆ రాక్షసుడికి అప్పగించకండి. వికటించినా ఫరవాలేదు ఆ మందు ఇవ్వండి"అన్నది.

నేను ఆమెను ఓదారుస్తూ నెమ్మదిగా "అంత భయపడకండి. నిజం చెప్పాక నాకు కోపం పోయింది. ఇక వైద్యం చెయ్యవలసింది మీకు కాదు. ఆయనకు. ఇప్పుడు వస్తాడుకదా. నన్ను కూడా ప్రయత్నించ నివ్వండి. మీ వంటి అందాల భరిణను చూస్తూ చూస్తూ రాక్షసుడికి అప్పగించను. అలా అని మాట ఇస్తున్నాను. నాకు తోచిన ఉపాయం చెబుతున్నా. మనం వెంటనే మద్రాసు వెళదాం. మన వెంట మీ ఆయన వస్తాడు. అక్కడ నా స్నేహితుడి నర్సింగ్‌హోమ్ ఒకటి ఉన్నది. ఆయన అమెరికా వెళ్ళివచ్చాడు. అక్కడ నల్లమందు వేసుకోవడం, తాగుడువంటి దుర్వ్యసనాలు ఉన్న వాళ్లను అవి మాన్పించి,

బాగుచేసి మంచి ఆరోగ్యవంతులను చేసే వైద్యాలయాలు ఉన్నాయట. వాటిల్లో పనిచేసి మంచి అనుభవం సంపాదించి వచ్చాడతను. మిమ్మల్ని ఇద్దర్నీ ఆయన దగ్గరకు తీసుకొని వెళతాను. మీ విషయం దాచకుండా చెప్తాను. అతన్ని ఒప్పించి మీకు అవసరమైన స్వేచ్ఛ లభించేలా చేస్తాను. అక్కడికి వెళ్లేదాక మీరు మీనటన కొనసాగించండి" అన్నాను.

ఆమె సరే అన్నది. ఆమె పరమానంద పడ్డది. ఆమె ముఖంలో సంతోషం ప్రస్ఫుటంగా కన్పించింది. సిగ్గుపడ్డది. చిరునవ్వు నవ్వింది.

"ఏదీ మళ్ళీ ఒక్కసారి నవ్వండి" అన్నాను నేనూ అప్రయత్నంగా నవ్వుతూ. ఆమె చిరుకోపం ప్రదర్శించింది.

ఆరోజు రాత్రి మెయిలులో నేను మద్రాసుకు ప్రయాణమయ్యాను. వాళ్ళ ఇద్దర్నీ వెంటతీసుకొని వెళ్లాను. ఎన్నో చెబితేనే కాని ఆమెభర్తకు నావట్ల నమ్మకం కలగలేదు. అతికష్టంమీద ఆయన్ను ఒప్పించినందుకు ఆమె ఎంతో సంతోషించింది.

మద్రాసులో నా స్నేహితుణ్ణి కలుసుకొన్న మరుక్షణంనుంచీ నాకు ధైర్యం కలిగింది. నా మనస్సు ఎంతో తేలికపడ్డది. ఆయన వాళ్లిద్దరి విషయంలోనూ హామీ ఇచ్చాడు. అతన్ని బాగుచేస్తా నన్నాడు. నెల రోజులదాకా జబ్బుపడినట్లు నటిస్తూ తన నర్సింగ్‌హోమ్‌లో ఆవిడకూడా ఉండేందుకు తగిన సదుపాయం కల్పిస్తానన్నాడు.

ఆ సంసారం కుదుట పడుతుందని నాకు నమ్మకం కలిగింది. నా ఫీజు నాకు వచ్చింది. అతని తలిదండ్రులు, ఆమె తల్లీ నాపట్ల కృతజ్ఞత చూపుకొన్నారు. ఒక పెద్ద యింటి ఆడపడుచు, అందం, ఆకర్షణ కల యువతి అకారణంగా చెడిపోకుండా కాపాడ కలిగాను. ఆమె భర్తను దుర్వ్యసనాలు మాన్పించి సరియైన దారిలోపెట్టే

ఉపాయం చెప్పాను. స్థలం మార్పుతోపాటు మంచి వైద్యంకూడా జరిగితే ఆమెభర్త తప్పక బాగుపడతాడు... అలా అనుకొంటూ నేను నిజంగా సంతోషించాను.

ఒక నెలరోజుల తర్వాత మద్రానునుంచి ఉత్తరం వచ్చింది. కవరుమీద నా స్నేహితుని దస్తూరీ గుర్తుపట్టాను. కవరు జాగ్రత్తగాచింపి ఆ ఉత్తరం నెమ్మదిగా చదవడం మొదలు పెట్టాను.

'కమల సినిమాలలో చేరింది. ఇదేదో కథాప్రారంభం అనుకొని ఆశ్చర్యపడుతున్నావు కదూ. కాని అటువంటి దేమీకాదు. డాక్టర్లం మనకు అంత తీరుబాటు ఎక్కడ ఉంటుంది. సరే అసలు విషయంచెప్తాను. నెల రోజులక్రిందట నువ్వు ఇద్దరు వ్యక్తులను నాకు వప్పగించి వెళ్లావు. ఆమె పేరు కమల. ఆమె విషయమే ఇప్పుడు చెబుతున్నాను. ఆమె ఇక్కడకు వచ్చాక చాలా మారింది. ఆమె చదువు, మంచి సంస్కారం ఉన్న మనిషి. చదువుకోనిదానిలాగా, కేవలం అమాయకురాలులాగా నటిస్తుంది. ఆమె మాట్లాడుతుంటే ముచ్చటగా, ముద్దుగా ఉంటుంది. సరే ఆమె కడుపునొప్పితో బాధపడుతున్నట్లు నటించడం నీకూతెలుసుగా. అతనికి నీవు వెళ్లిన మరునాటి నుంచే వైద్యం అదీ ప్రారంభించాను. అతనిచేత ఆమెకు పగలంతా సేవలు చేయించాను. అతను బయటకుపోయి తాగిరాకుండా ఏర్పాట్లు చేశాను. అతను మే మెవ్వరం అనుకోనంత సులభంగా నా అదుపులోకి వచ్చాడు. ఆమెకు కావలసినంత స్వేచ్ఛ లభించింది. వచ్చిన సినిమాకల్లా వెళ్లింది. అన్ని నాటకాలు చూచింది. చెప్పవచ్చిన విషయం ఏమంటే—ఆమధ్య ఓచిన్న సంఘటన జరిగింది. సినిమా ప్రొడ్యూసరు— నాస్నేహితుడు ఒకరు నాసహాయం కావలసి ఇక్కడకు వచ్చాడు. ఆయన తీస్తున్న చలనచిత్రంలో ప్రయివేటు నర్సింగ్‌హోమ్‌లో ఒకసన్ని వేశం చిత్రికరించవలసివచ్చింది.

అది వాస్తవంగా ఉండేలా చెయ్యడం ఎలాగా అని నాదగ్గరకు వచ్చాడు. నా అనుమతి చూశాక ఆయన తన పూర్వపు అభిప్రాయం మార్చుకొని షూటింగ్ ఇక్కడే చేస్తానన్నాడు. నేను ఒప్పుకోక తప్పలేదు. కథానాయకురాలు ప్రక్కన పేషంట్‌గా నటించేందుకు ఎవరో ఎక్స్‌ట్రాను తీసుకొని రావలసివచ్చింది. ఎవరో ఎందుకండీ మా పేషంటుభార్య కమల ఉన్నది. ఆమె బాగా నటిస్తున్నది చూడండి అన్నాను డైరెక్టరు గారితో. అంతే ప్రొడ్యూసరుగారు నా మాట మన్నించి డైరెక్టరుగారితో ఆమెకు అవకాశం ఇమ్మన్నారు. ఆమె అద్భుతంగా నటించింది. అక్కడ కొంత సంభాషణ కూడా కల్పించారు. వాచకం అద్భుతంగా ఉన్నదని డైరెక్టరు తెగ మెచ్చుకొన్నాడు. వెంటనే మరో పిక్చర్‌లో బుక్ చేశారాయన. ఆమె యిప్పుడు నాలుగయిదు సినిమాలలో బుక్ అయింది. ప్రస్తుతానికి చిన్నచిన్న పాత్రలు మాత్రమే వేస్తున్నా త్వరలో కమల పెద్ద సినీనటి కాబోతున్నది. ఆమె భర్త ఇప్పుడు తాగుడూ అదీ మానేశాడు...కాని మజ్నూ అయిపోతున్నాడేమో అని భయం వేస్తున్నది. అతను ఎప్పుడూ ఆమె వెంట కాపలాగా ఉంటున్నాడంటే నమ్మవుకదూ. పోనీలే, అవన్నీ మనకెందుకు. వాళ్ళిద్దరూ నాకు ఫీజుక్రింద పెద్దమొత్తమే ఇచ్చారులే. కాని కమల ఓసారి ఏమన్నదో తెలుసా—ఎందుకులే నువ్వు ఏమన్నా అనుకుంటావు. అయినా చెప్తాను. మనం ఇద్దరం భయస్తులం అన్నది. ఆ మాట వాస్తవానికి... నిజమే కదూ..."

నేను ఆశ్చర్యపడుతూ — నిజమేనా? అనుకొంటూ ఆ ఉత్తరంవంకే చూస్తూ చాలాసేపు అలా ఉండిపోయాను.

---